క్లుప్తంగా

సాయిబాబాకు క్షీరాభిషేకం

పాల్వంచరూరల్: క్రోధినామ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం సాయిబాబాకు అర్చకులు క్షీరాభిషేకం నిర్వహించారు. మండల పరిధి లక్ష్మీదేవిపల్లిలోని శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో ఉగాది సందర్భంగా భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

చలివేంద్రం ఏర్పాటు



ప్రారంభిస్తున్న ప్రకాశ్‌రావు

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం చాతకొండ క్రాస్‌రోడ్డులో ఉగాది పర్వదినం సందర్భంగా మంగళవారం త్రివేణి, కృష్ణవేణి విద్యాసంస్థల నానమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గొల్లపూడి ప్రకాశ్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకుని దూర ప్రాంతాల నుంచి వచ్చిపోయే ప్రజలకు దాహార్తిని తీర్చాలనే సంకల్పంతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ వీరేంద్ర చౌదరి, గొల్లపూడి జగదీష్, కాట్రగడ్డ మురళి, మాజీ సర్పంచ్‌లు తాటి పద్మ, భూక్యా పద్మ, ఆత్మకమిటీ డైరెక్టర్ శేషాద్రి వినోద్, వీరపనేని రామకృష్ణ, శ్రీకాంత్, హనుమంతరావు, డాక్టర్ ఆనంద్, రాజు, గ్యాస్ మోహన్ పాల్గొన్నారు.

కేసు నమోదు

పాల్వంచరూరల్: వేగంగా వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన ప్రమాదంలో కారు డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు... మండల పరిధిలోని ఆర్‌టీఏ చెక్‌పోస్టు సమీపంలో బీసీఎం జాతీయ రహదారిపై సత్తుపల్లి మండలం చెరుకుపల్లి గ్రామానికి చెందిన జేసీబీ డ్రైవర్ కుంజా రామకృష్ణ ఈనెల 6వ తేదీ సాయంత్రం పాల్వంచ నుంచి భద్రాచలం వెళ్తుండగా పాల్వంచ వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రామకృష్ణ కిందపడిపోవడంతో కాలుకు తీవ్ర గాయపడటంతో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. క్షతగాత్రుడి సోదరుడు కుంజ కృష్ణ ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన రామవరానికి చెందిన అబ్దుల్ అహ్మద్‌పై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

వాహనదారులపై...

పాల్వంచ: అతివేగంగా వాహనాలను నడుపుతున్న ఇద్దరిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. మంగళవారం ఆటోలో డెక్ పెట్టి అతివేగంగా నడుపుతుండటంతో పోలీసులు బీసీఎం రోడ్డులో పట్టుకున్నారు. ఆటో డ్రైవర్ మొయిన్‌పై కేసు నమోదు చేశారు. అదేవిధంగా నవీన్ అనే యువకుడు రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటర్ సైకిల్‌ను అతివేగంగా నడుపుతుండటంతో ఎస్‌ఐ బి.రాము కేసు నమోదు చేశారు.

ఘనంగా లక్ష్మీనరసింహ స్వామి జాతర



ప్రభలతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

టేకులపల్లి: ప్రతీ సంవత్సరం ఉగాది రోజున రాత్రి జరుపుకునే లక్ష్మీనరసింహ స్వామి జాతర వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ప్రభలు కట్టుకుని ఊరేగింపుగా తరలివచ్చారు. పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. జాతరకు వస్తున్న భక్తులకు బేతంపూడి దర్గా నిర్వాహకులు కులమతాలకు అతీతంగా పానకం, పండ్లు వితరణ చేశారు.



ఘనంగా షడ్రుచుల ఉగాది

- క్రోధినామ సంవత్సరానికి స్వాగతం
- భక్తిశ్రద్ధలతో ప్రజల ప్రత్యేక పూజలు
- ఆలయాల్లో పంచాంగ పఠనం
- ఏరువాక సాగిన అన్నదాతలు

కొత్తగూడెంటౌన్: తెలుగు ప్రజల తొలి తెలుగు పండుగ ఉగాది పండుగను ఈ ఏడాది క్రోధినామ సంవత్సరంగా పిలుస్తూ మంగళవారం ప్రజలు ఇళ్లలోనూ, ఆలయాల్లోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు ఇంట్లో షడ్రుచులతో ఉగాది పచ్చడిని తయారుచేసి బంధుమిత్రులకు అందజేశారు. ఉగాది సందర్భంగా ఆలయాల్లో పంచాంగ శ్రవణం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు నూతన ఏడాది తమ జాతకం ఎలా ఉంటుందనే రాశిఫలాలను అడిగి తెలుసుకున్నారు. ఆలయాలకు పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో ఆలయాలు అన్ని కిటకిటలాడాయి.

పెద్దమ్మతల్లి ఆలయంలో..

పాల్వంచరూరల్: మండల పరిధి కేశవపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీకనక దుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో ఉగాది పర్వదినం సందర్భంగా మంగళవారం సాయంత్రం అర్చకులు క్రోధినామ సంవత్సరం పంచాంగ శ్రవణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వేదపండితులు పద్మనాభశర్మ, రవికుమార్ శర్మ పాల్గొన్నారు.



ఇల్లెందు: ఉగాది పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కోరం కనకయ్య - లక్ష్మి దంపతులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ సర్వమతాలకు నిలయమని, సంస్థలోని వివిధ విభాగాలలో పనిచేసే కార్మికులందరూ అన్నదమ్ముల వలె కలిసిమెలిసి ఉండటం అభినందనీయమని కొత్తగూడెం ఏరియా ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షులు ఎండీ రజాక్ అన్నారు. కొత్తగూడెం ఏరియాలో మంగళవారం ఉగాది పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగాది పచ్చడిని కార్మికులు, ఉద్యోగులకు పంపిణీ చేశారు.

ఇల్లెందు: తెలుగువారి తొలి పండుగ ఉగాది పర్వదినం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఎమ్మెల్యే కోరం కనకయ్య- లక్ష్మి దంపతులు ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం పంచాంగ శ్రవణం ఏర్పాటు చేశారు. క్రోధి నామ ఉగాది పర్వదినాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. క్యాంపు కార్యాలయాన్ని వేప, మామిడి తోరణాలతో అలంకరించారు. వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి పంచాంగం పఠించారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం కోరం కనకయ్య మాట్లాడుతూ... తెలుగు పండుగలలో ఉగాదికి ప్రత్యేకత ఉందని, ఈ రోజు నుంచి తెలుగు వారి సంవత్సరం ప్రారంభం అవుతుందన్నారు. రైతులు వ్యవసాయం ప్రారంభించే రోజుగా, వ్యాపారులు కొత్త పుస్తకాలు పూజలు చేసి ప్రారంభించే రోజుగా పేర్కొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, మాజీ చైర్మన్ యదళ్లపల్లి అనసూర్య, మాజీ సర్పంచ్‌లు, కాంగ్రెస్ పట్టణ, మండల అధ్యక్షుడు దొడ్డా డానియేల్, పులిసైదులు, సుదర్శన్ కోరీ, పింగళి నరేష్‌కుమార్, కొక్కు నాగేశ్వరరావు, మడుగు సాంబమూర్తి, బోళ్ల సూర్యం, గోచికొండ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

లేక్ వ్యూ పార్క్‌లో...

పట్టణంలోని లేక్ వ్యూ పార్క్‌లో మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఉగాది పండుగ సందర్భంగా ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణ పఠనం చేశారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య జ్యోతి ప్రజ్వలన చేశారు. పట్టణ ప్రముఖులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అనంతరం ప్రసాదం, పానకం, ఉగాది పచ్చడి, స్వీట్లు పంపిణీ చేశారు.

ఇల్లెందురూరల్: మండలంలోని పలు గ్రామాలలో ఉగాది పర్వదినాన్ని మంగళవారం ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. భక్తులు ఉదయమే లేచి తలంటు స్నానాలు ఆచరించారు. తెల్లవారు జామునే ఇంటిద్వారాలకు మామిడితోరణాలతో అలంకరించారు. నూతన వస్త్రాలు ధరించి ఆలయాలను సందర్శించి పూజలు చేశారు. కొమరారం సుభాష్‌నగర్, రొంపేడు, అంజనేయపురం, సుదిమళ్ల ఆలయాలలో ప్రధాన అర్చకులు పఠించిన పంచాంగాన్ని స్థానికులు ఆలకించారు. ఇదిలా ఉండగా ఉగాది పండుగను పురస్కరించుకొని అన్నదాతలు ఏరువాక ప్రారంభించారు.

జూలూరుపాడు: మండల ప్రజలు ఉగాది పర్వదినాన్ని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. షడ్రుచులతో తయారు చేసిన ఉగాది పచ్చడిని కుటుంబంలోని వారికి, ఇరుగు, పొరుగు వారికి పంపిణీ చేసి ఆనందోత్సవాలతో పండుగ జరుపుకున్నారు. వ్యాపారులు, వివిధ వృత్తులకు చెందిన వారు తమ షాపులను, దుకాణాలను మామిడి తోరణాలతో అలకరించి, ప్రత్యేక పూజలు చేసారు. రైతులు గోవులను శుభ్రపరిచి, పసుపు, కుంకమలతో అలంకరించి పూజలు చేశారు. ఆలయాల్లో ప్రజలు ప్రత్యేక పూజలు చేసి, పంచాంగ శ్రవణం వినిపించారు.

ఇల్లెందు(టేకులపల్లి): ఉగాది సందర్భంగా మంగళవారం మండలంలోని ఆలయాలు, ఇళ్లల్లో ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. కొప్పురాయి గ్రామంలోని స్వర్ణలింగేశ్వర మల్లన్న స్వామి ఆలయంలో మారోజు శ్రీనివాసాచార్యుల అర్చకత్వంలో గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు.



ఇల్లెందురూరల్: కొమరారం రామాలయంలో పంచాంగం పఠిస్తున్న అర్చకుడు రామాచార్యులు



జూలూరుపాడు: మాచినేనిపేట తండాలో గోవులను పూజిస్తున్న రైతులు





గుండెపుడి శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయంలో, పడమటనర్సాపురం శ్రీసీతారామాలయంలో...



జూలూరుపాడులో ఉగాది పచ్చడి చేస్తున్న యువతి



పాల్వంచరూరల్: పెద్దమ్మగుడి వద్ద పంచాంగ శ్రవణం...



జూలూరుపాడు: పాపకొల్లు శివాలయంలో...



ఇల్లెందు(టేకులపల్లి): కొప్పురాయిలోని స్వర్ణలింగేశ్వర మల్లన్న స్వామి ఆలయంలో..



సింగరేణి(కొత్తగూడెం): ఉగాది శుభాకాంక్షలు చెబుతున్న రజాక్

కాంగ్రెస్‌లో చేరిక



సీఎం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన శ్రీనివాస్

కొత్తగూడెంరూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కొత్తగూడెం పట్టణానికి చెందిన మాదిగ దండోరా, చర్మకారుల సంఘం నాయకులు కూసపాటి శ్రీనివాస్ మంగళవారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. శ్రీనివాస్‌తో పాటు ఖమ్మం ఉమ్మడి జిల్లాకు చెందిన 200 మంది సంఘం నాయకులు, సభ్యులు చేరారు.

ఎన్నికల అబ్జర్వర్‌గా గౌస్ నియామకం



గౌస్‌కు నియామకపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

ఇల్లెందు: కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం పార్లమెంట్ ఎన్నికల నియోజకవర్గ అబ్జర్వర్‌గా ఇల్లెందు పట్టణానికి చెందిన ఎస్‌కే గౌస్‌ను నియమిస్తూ ఆదేశాలు విడుదల చేశారు. ఏఐసీసీ వైస్ చైర్మన్ మైనార్టీ విభాగం తెలంగాణ ఇన్‌చార్జ్ ఫర్మాన్ అజ్మీ విడుదల చేసిన ఆదేశాలను మంగళవారం ఎమ్మెల్యే కోరం కనకయ్య చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా గౌస్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ గెలుపుకు కృషి చేస్తానని తెలిపారు. గౌస్‌కు పదవీ రావటం పట్ల సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎస్‌కె జానీ, గౌస్, డానియేల్, సైదులు, నరేష్, సుదర్శన్ కోరీ, మున్నా, అక్తర్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

కులమతాలకు అతీతంగా కలిసి ఉండాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

పాల్వంచ: మత విద్వేశాలు దేశ పురోగతికి, సమాజ గమనానికి విఘాతం కలిగిస్తాయని, ప్రజాస్వామ్య భారతదేశంలో కులమతాలకు అతీతంగా అంతా కలిసిమెలసి ఉండాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక జామే మజీద్‌లో ఇఫ్తార్ విందులో పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ... రంజాన్ పండుగ సందర్భంగా ఫిత్రా, జకార్త్ వంటి నియమాలు పేదవాని ఆకలిని, శ్రమను గుర్తు చేస్తాయన్నారు. తన సంపదలో కొంత భాగాన్ని పేదల ఆకలి తీర్చేందుకు కేటాయించడం మహోన్నతమైందన్నారు. మహ్మద్ ప్రవక్త బోధనలు ప్రపంచ మానవాళికి అనుసరణీయమని, ప్రతీఒక్కరు ఆయన చూపిన మార్గంలో పయనించి శాంతిని నెలకొల్పే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌కే సాబీర్ పాషా, ముత్యాల విశ్వనాథం, అడుసుమల్లి సాయిబాబు, పూర్ణచందర్‌రావు, ఫయాజ్‌ల్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

‘చంద్ర’ ఆశయాలు సాధించాలి

పాల్వంచ: దేశ వ్యాప్తంగా భూ పోరాటాలు నిర్వహించి నిరుపేద కుటుంబాలకు జీవనోపాధి కల్పించిన చంద్ర రాజేశ్వరరావు ఆశయాలు సాధించాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ముత్యాల విశ్వనాథం అన్నారు. మంగళవారం సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి చంద్ర రాజేశ్వరరావు 31వ వర్ధంతి సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశ్వనాథం మాట్లాడుతూ... జమిందారీ కుటుంబంలో జన్మించిన చంద్ర రాజేశ్వరరావు కమ్యూనిస్టు ఉద్యమాలకు ఆకర్షితులై యావదాస్తిని పేదలకు పంచిన మహనీయుడన్నారు. పేదలకు భూమి దక్కితేనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని విశ్వసించిన వ్యక్తి అన్నారు. కార్యక్రమంలో పట్టణ, మండల కార్యదర్శులు అడుసుమల్లి సాయిబాబు, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్ పాల్గొన్నారు.

సింగరేణి(కొత్తగూడెం): దేశవ్యాప్తంగా భూపోరాటాలకు శ్రీకారం చుట్టి, నిరుపేద కుటుంబాలకు జీవనోపాధి కల్పించిన చంద్ర రాజేశ్వరరావు చిరస్మరణీయుడని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సీపీఐ అగ్రనాయకుడు, జాతీయ ప్రధాన మాజీ కార్యదర్శి చంద్ర రాజేశ్వరరావు 30వ వర్ధంతిని మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటైన స్మంసరణ సభలో కూనంనేని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కే సాబీర్‌పాషా, సలిగంటి శ్రీనివాస్, జి.వీరస్వామి, కే.రత్నకుమారి, మాతంగి లింగయ్య పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

పాల్వంచ: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. మొర్రేడు వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను శ్రీనివాస కాలనీ వద్ద ఎస్‌ఐ బి.రాము మంగళవారం పట్టుకుని సీజ్ చేశారు. డ్రైవర్ భూక్యా రవిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉగాది పురస్కారం

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం హనుమాన్ బస్తీకి చెందిన కవి రాజేష్‌కు ఉగాది విశిష్ట సాహిత్య పురస్కారం వరించింది. ఖమ్మంలో వికాస వేదిక సాహిత్య సంస్థ ఆధ్వర్యాన మంగళవారం నిర్వహించిన కవి సమ్మేళనంలో ఆయనకు ఈ పురస్కారం అందజేసి సన్మానించారు.



పురస్కారం అందుకుంటున్న రాజేష్

తాగునీటి ఎద్దడికి చెక్ పెట్టేలా..

- రూ.34.99 లక్షల వ్యయంతో పనులు
- రూ.69.45 లక్షల వ్యయంతో అదనపు ప్రతిపాదనలు
- పంచాయతీల ఆధ్వర్యంలో చేతిపంపులకు మరమ్మతులు
- యుద్ధప్రాతిపదికన సాగుతున్న పనులు



నెహ్రూనగర్‌లో కొనసాగుతున్న పైపులైను పనులు

ఇల్లెందురూరల్: వేసవి ప్రారంభంలోనే భానుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. సహజంగా నీటి వినియోగం పెరగడంతో పల్లెల్లో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. ప్రస్తుతం మిషన్ భగీరథ ద్వారా పల్లెలకు తాగునీటి సరఫరా జరుగుతున్నా అవి ప్రజా అవసరాలను పూర్తిస్థాయిలో అందించలేకపోతున్నాయి. దీంతో నీటిఎద్దడి నివారణకు ప్రభుత్వం ముందస్తుగా నిధులు విడుదల చేసింది. వీటితో మండలంలో నీటిఎద్దడి ప్రాంతాలను గుర్తించి ముందస్తు పనులు ప్రారంభించారు. మరికొన్ని ప్రాంతాలలో ముందస్తుగా పనులు చేపట్టేందుకు అంచనాలు రూపొందించి మంజూరు కోసం ప్రభుత్వానికి క్షేత్రస్థాయి అధికారులు ప్రతిపాదనలు పంపించారు.

అడుగంటిన భూగర్భ జలాలు...

గ్రామాలలో మిషన్ భగీరథ నీటి సరఫరా జరుగుతున్నప్పటికీ పైపులైన్లు అన్ని ప్రాంతాలకు విస్తరించకపోవడం, ఉన్న పైపులైన్లు లీకేజీలకు గురికావడంతో చాలావరకు గ్రామాలలో నీటి ఎద్దడి ప్రారంభమైంది. దీనికితోడు భూగర్భజలాలు అడుగంటడంతో గ్రామాలలో బావులు, బోర్లు వట్టిపోయాయి. దీంతో ఇంటి అవసరాలకు వాడుకునేందుకు అవసరమైన నీటిని సేకరించేందుకు ప్రజలకు కష్టంగా మారింది.

ముమ్మరంగా చేతిపంపుల మరమ్మతులు...

గ్రామాలలో వట్టిపోయిన బోర్లు కాకుండా మిగతా బోర్లకు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మరమ్మతులు చేపడుతున్నారు. చాలాకాలం తరువాత బోర్లకు మరమ్మతులు చేస్తుండటంతో పైపులు, బోరు హ్యాండిల్స్ అవసరం పెరిగింది. బోర్ మెకానిక్‌ల కొరత కారణంగా అత్యవసరం ఉన్న గ్రామాలకు ప్రాధాన్యతనిస్తూ పనులు ముమ్మరం చేశారు.

రూ.34.99 ఖర్చుతో జరుగుతున్న పనులు...

గ్రామాలలో నీటిఎద్దడి నివారణకు అత్యవసరంగా చేపట్టాల్సిన పనులపై ముందస్తుగా సర్వే చేసిన అధికారులు ఆ దిశగా పనులు ప్రారంభించారు. ప్రధానంగా నూతనంగా పైపులు పర్చడం, ట్యాంకు నుంచి పైపులైన్‌కు కనెక్షన్లు ఇవ్వడం, వాల్వ్‌ల మరమ్మతు, కొత్త వాల్వ్ ఏర్పాటు చేయడం వంటి పనులు చేపడుతున్నారు. నెహ్రూనగర్, నెహ్రూనగర్‌తండా గ్రామాలకు రూ.8.50 లక్షల వ్యయంతో పైపులైన్లు, బొజ్జాయిగూడెం సమ్మక్క ఆలయం వద్ద రూ.5లక్షల వ్యయంతో బోరు మోటారు ఏర్పాటు చేయడం, సుంకరగూడెంలో రూ.9.79 లక్షల వ్యయంతో పైపులైను, కొర్లగూడెం, జింకలతండాలలో ట్యాంకు నుంచి పైపులైను వరకు రూ.3లక్షల వ్యయంతో కనెక్షన్ , ముకుందాపురం క్యాంపులో రూ.3లక్షలతో డిస్ట్రిబ్యూషన్ లైన్ ఏర్పాటు, సీఎస్సీ బస్తీ, కట్టుగూడెంలో రూ.2.70 లక్షలతో వాల్వ్ ఏర్పాటు చేయడం, ఒడ్డుగూడెంలో రూ.2లక్షల వ్యయంతో పైపులైను, మస్సివాగులో రూ.1.40 లక్షల వ్యయంతో పైపులైన్‌కు కనెక్షన్ ఇవ్వడం వంటి పనులలో కొన్ని ఇప్పటికే పూర్తికాగా మిగతా పనులు యుద్ధప్రాతిపదికన చేపడుతున్నారు.

రూ.69.45 లక్షల వ్యయంతో ప్రతిపాదనలు...

ప్రస్తుతం అత్యవసరమైన పనులు చేపడుతుండగా నీటిఎద్దడి తీవ్రరూపం దాల్చే పరిస్థితి కనిపించడంతో ముందుజాగ్రత్త పనులకు అధికారులు సిద్ధమయ్యారు. దీనికోసం గ్రామపంచాయతీల వారీగా చేపట్టాల్సిన పనులను గుర్తించారు. ప్రధానంగా గ్రామాలలో గతంలో పనిచేసిన బోర్‌మోటార్లు, బావుల వద్ద మోటార్ల మరమ్మతులు, కొత్త వాటి కొనుగోలు, ఛిద్రమైన పైపులైన్లకు మరమ్మతులు, కొత్త పైపులైన్లు వంటి పనులకు ప్రాధాన్యమిస్తూ మొత్తంగా రూ.69.45 లక్షల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించారు. రెండు, మూడు రోజులలో మంజూరయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.



సుంకరగూడెంలో పైపులైను పనులు పరిశీలిస్తున్న అధికారులు

అనుకున్నట్లుగా పనులు సకాలంలో పూర్తి చేస్తే ప్రస్తుత వేసవిలో మండలంలో నీటి ఎద్దడిని కొంతైనా నివారించే అవకాశం ఉంది.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నాం...



మండలంలో తాగునీటి ఎద్దడి లేకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతానికి అన్ని గ్రామాలకు నీటి సరఫరా జరుగుతోంది. అత్యవసరమైన చోట్ల మంజూరైన నిధులను పనులు ప్రారంభించాం. ముందు జాగ్రత్త చర్యగా నీటిఎద్దడికి అవకాశం ఉన్న గ్రామాలను గుర్తించి పనులు చేపట్టేందుకు అంచనా వ్యయంతో ప్రభుత్వానికి నివేదిక పంపించాం.

– బాలాజీ, డీఈ, మిషన్ భగీరథ గ్రిడ్, ఇల్లెందు

ఉగాది ఉత్సవాలు ప్రారంభం





పాల్వంచ: పంచాంగం వినిపిస్తున్న సంపత్ కుమార్ అప్పలాచార్యులు, వేడుకలు ప్రారంభిస్తున్న జడ్జి భానుమతి

పాల్వంచ: పాల్వంచ కళాపరిషత్ ఆధ్వర్యంలో పట్టణంలోని వేణుగోపాల్ థియేటర్ ప్రాంగణంలో మూడు రోజులు నిర్వహించనున్న ఉగాది సంబురాలు మంగళవారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా బ్రహ్మశ్రీ గోడవర్తి సంపత్‌కుమార్ అప్పలాచార్యులు క్రోధి నామ సంవత్సర పంచాంగ శ్రవణం వినిపించారు. అనంతరం ఉత్సవాలను ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి.భానుమతి ప్రారంభించారు. మాట్లాడుతూ.. కళలను ప్రోత్సహించడం వాటిని భావితరాలకు అందించడం ప్రతీఒక్కరి బాధ్యత, ప్రతీ ఏటా ఉగాది ఉత్సవాలు నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. అనంతరం వరలక్ష్మి నృత్యాలయం భరత నాట్యం, బేరా శ్రీ లక్ష్మి బృందం కోలాట నృత్యం, రమాదేవి బృందం కూచిపూడి నృత్యం, జైభీమ్ కళాబృందం జానపద నృత్యాలు, ఫైర్ డ్యాన్స్ రమేశ్ ఈశ్వర్ హాస్యవల్లరి, రేడియో ఆర్టిస్ట్ ఎస్.రూపాదేవి అన్నామాచార్య కీర్తనలు అలరించాయి. ప్రముఖ వైద్యులు డాక్టర్ వాసిరెడ్డి రమేశ్ బాబుకు ఉగాది పురస్కారం అందించారు.

కార్యక్రమంలో కళాపరిషత్ కమిటీ సభ్యులు డాక్టర్ బిక్కసాని సుధాకర్‌రావు, మంతపురి రాజుగౌడ్, వేముల కొండలరావు, నామా బుచ్చయ్య, గొర్రెపాటి రమేశ్, లింగమూర్తి, ఇంటూరి రవి, ఎర్రగుంట సాంబశివరావు, ముగిది శ్రీనివాసరావు, సంక్రాంతి రవి,మీనా కుమారి, చారి తదితరులు పాల్గొన్నారు.